ఇది అప్రజాస్వామ్యం

- తిరుపతి సాక్షి కార్యాలయంపై దాడిని ఖండించిన ప్రజాస్వామ్యవాదులు
- ఇదో అరాచకం
- ఇది కూటమి పనేనంటున్న జనం
- సాక్షి గొంతుకను ఎవరూ నొక్కలేరు

పలమనేరు: పత్రికా స్వేచ్ఛను అడ్డుకోవడం అప్రజాస్వామికమని పలమనేరుకు చెందిన పలువురు వామపక్షాల నాయకులు, ప్రజాసంఘాలు, న్యాయవాదులు, మేధావులు ఖండించారు. రేణిగుంటలోని సాక్షి ఎడిషన్ సెంటర్‌పై కూటమి మద్దతుదారులు రెండ్రోజుల క్రితం దాడులు చేయడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో కూటమి పాలనలోని లోపాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్న సాక్షి గొంతుక నొక్కాలని ప్రభుత్వమే ఇలా చేస్తోందనడానికి రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లోని సాక్షి కార్యాలయాలపై దాడుల ఉదంతాలు అద్దం పడుతున్నాయని, ఇదెంతమాత్రం సరికాదని ముక్తకంఠంతో ఖండించారు. దేశంలో మరే రాష్ట్రంలో కూడా ఇటువంటి ఘటనలు జరగలేదని నిరసించారు.


రేణిగుంటలో సాక్షి కార్యాలయంపై దాడి చేస్తున్న రౌడీ మూకలు (ఫైల్)

ఇలా దాడులు చేసిన ప్రభుత్వాలు ఎన్నో కూలాయి



కూటమి అధికారంలోకి వచ్చాక దేశంలో ఎక్కడాలేని విధంగా పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు బిగిస్తోంది. గతంలో పత్రికా స్వేచ్ఛను కాలరాచేందుకు యత్నించిన ఎన్నో ప్రభుత్వాలు నేలకూలిన చరిత్రను పాలకులు విస్మరించరాదు. పత్రికల విషయంలో ద్వంద్వ నీతిని అనుసరించడం ఎంతమాత్రమూ సరికాదు. పత్రికా కార్యాలయంపై అల్లరిమూకలు దాడులు చేయాలంటే దాని వెనుక ఎవరి హస్తం ఉందో సామాన్య ప్రజలకు కూడా తెలిసిపోయింది.

–సోమచంద్రారెడ్డి, జిల్లా మేధావుల ఫోరం అధ్యక్షులు

ప్రభుత్వంపై ప్రజల ఆగ్రహం



ఎన్నికల హామీలను అధికారంలోకి వచ్చాక కూటమి ప్రభుత్వం నెరవేర్చలేదు. దీంతో ఈ ప్రభుత్వంపై ప్రజలు ఆగ్రహంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో సాక్షి పత్రిక, టీవీ ప్రజల పక్షాన గొంతుకలు వినిపిస్తున్నాయి. దీన్ని ఓర్వలేక ఎక్కడ ఏమి జరిగినా దాన్ని సాక్షిపై నెట్టి కార్యాలయాలపై దాడులు చేయడం, జర్నలిస్టులను భయభ్రాంతులకు గురి చేయడం సరికాదు. అంతేకాకుండా ప్రజల గొంతుక వినిపిస్తూ, ప్రభుత్వ అసమర్థ విధానాలను ఎత్తి చూపుతున్న కొన్ని చానళ్ల ప్రసారాలను సైతం ఉద్దేశపూర్వకంగా నిలుపుదల చేయడం వెనుక కూటమి ప్రభుత్వమే ఉందని ప్రజలు విశ్వసిస్తున్నారు.

యోగేష్‌బాబు, ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షులు

రంగు పులిమి రాజకీయం చేయడం తగదు



ఎన్నో ఛానళ్లలో డిబేట్‌లు జరుగుతుంటాయి. అమరావతి అంశంపై సాక్షి ఛానల్‌లో కొమ్మినేని డిబేట్ నిర్వహించగా అందులో పాల్గొన్న వ్యక్తి ఏదో మాట్లాడితే దాన్ని పట్టుకుని ఆ వ్యక్తిని అరెస్ట్ చేయడం, ఏమాత్రం సంబంధం లేని సాక్షి ప్రింట్ మీడియా కార్యాలయాలపై దాడులు సరికాదు. రాజకీయాలు వేరు పత్రికలు వేరని గమనించాలి. ఎక్కడ, ఏం జరిగినా దానిని 'సాక్షి'కే ఆపాదించి, రంగు పులిమి రాజకీయం చేయడం తగదు

–సయ్యద్ మొహిద్దీన్, సీనియర్ అడ్వొకేట్

పత్రికలే లేకుంటే నిరంకుశత్వమే రాజ్యమేలుతుంది



సాధారణంగా ఏ పత్రికైనా ప్రజల పక్షాన గళం వినిపించాలి. కొందరు వ్యక్తులు, పార్టీల ప్రయోజనాలే పరమావధిగా కొమ్ము కాయరాదు. ప్రజాసామ్యంలో పత్రికలే లేకుంటే నిరంకుశత్వం రాజ్యమేలుతుంది. జర్నలిస్టుల గొంతునొక్కినంత మాత్రాన సమస్యకు పరిష్కారం దొరకదు. ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారంలోని రాజకీయ పార్టీలు కృషి చేయాలి.

–భువనేశ్వరి, ఐద్వా జిల్లా నాయకురాలు

క్లుప్తంగా

జెడ్పీ చైర్మన్ నివాళి


నివాళులు అర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

వి.కోట : మండలంలోని ఓగు పంచాయతీ దేవరాజుపురానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంకటేష్ తండ్రి, అలాగే పట్రపల్లెకు చెందిన ఎర్రప్పగౌడు సతీమణి ముద్దమ్మ మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఇది తెలుసుకున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ఆయా గ్రామాలకు వెళ్లి మృతులకు నివాళులు అర్పించారు. కుటుంబాలను పరామర్శించారు.

పులిచెర్ల సీడీపీఓగా వాణిశ్రీదేవి



పులిచెర్ల(కల్లూరు)/రొంపిచెర్ల: పులిచెర్ల ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓగా వాణిశ్రీదేవి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సీడీపీఓగా పని చేస్తున్న నాగ శైలజ ఉద్యోగోన్నతిపై పీడీగా గుంటూరు జిల్లాకు బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో బంగారుపాళెం నుంచి వాణి శ్రీదేవి పులిచెర్లకు బదిలీపై వచ్చారు. ఆమె మాట్లాడుతూ, ప్రాజెక్టు పరిధిలోని పులిచెర్ల, రొంపిచెర్ల, సదుం మండలాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను అభివృద్ధి పథంలో నడిపిస్తామని అన్నారు. కార్యకర్తలు కూడా శాఖాపరమైన పథకాల ఫలాలను లబ్ధిదారులకు అందేలా చూడాలని, సిబ్బంది సమయపాలన పాటించాలని కోరారు.

వేరుశనగ విత్తనాల పంపిణీ


రొంపిచెర్లలో వేరుశనగ విత్తనాలు పంపిణీ చేస్తున్న అధికారులు

రొంపిచెర్ల: సబ్సిడీ వేరుశనగ విత్తనాల కోసం రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి సుధారాణి కోరారు. మంగళవారం స్థానిక రైతు సేవా కేంద్రంలో వేరుశనగ విత్తనాలు పంపిణీ చేసి ఆమె మాట్లాడారు. ఖరీఫ్ సీజన్ వేరుశనగ సాగు కోసం ప్రభుత్వం 40 శాతం సబ్సిడీతో విత్తన కాయలు పంపిణీ చేస్తోందని, కావాల్సిన రైతులు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు తీసుకుని వచ్చి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఒక రైతుకు 30 కిలోలు ఇస్తామని, అలాగే పచ్చిరొట్ట ఎరువులైన జనుము, జీలుగ విత్తనాలను కూడా ఇస్తున్నట్టు చెప్పారు. దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ ఇబ్రహీంఖాన్, మాజీ సర్పంచ్ రవికుమార్ నాయుడు, వార్డు మెంబర్లు నాగరాజ, లక్ష్మయ్య, రైతు సేవా కేంద్రం ఇన్‌చార్జి వెంకటరమణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

క్షయ నిర్ధారణ పరీక్షలు చేసుకోవాలి


ఫజులుపేటలో క్షయ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ వినయ్

రొంపిచెర్ల: క్షయ లక్షణాలు ఉన్న పక్షంలో వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసుకోవాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి వినయ్ అన్నారు. మంగళవారం ఫజులుపేటలో టీబీ ముక్త్ భారత్ అభియాన్ లో భాగంగా క్షయ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ 60 ఏళ్ల పైబడి మధుమేహం, రక్తపోటు, క్యాన్సర్, గుండెపోటు, పక్షవాతం, హెచ్ఐవీ బాధితులు, ధూమపానం చేసేవారు, క్వారీ, ఇటుక బట్టీలలో పనిచేసేవారు విధిగా క్షయ నిర్ధారణ పరీక్షలు చేసుకోవడం మంచిదన్నారు. వ్యాధి బారిన పడినట్టు తేలితే వైద్యుల పర్యవేక్షణలో మందులు వాడితే వ్యాధి బారి నుంచి విముక్తి పొందవచ్చన్నారు. కార్యక్రమంలో మండల ఆరోగ్య విద్యాధికారి రాజేశ్వరి, ఎంఎల్‌హెచ్‌పీ సాయి పూజిత, ఆరోగ్య కార్యకర్త గాయత్రి, ఆశా కార్యకర్తలు గంగాభవాని, రెడ్డెమ్మ, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎంపీపీ జన్మదిన వేడుకలు


మాజీ ఎమ్మెల్యే, ఎంపీపీ, వైస్ ఎంపీపీని సన్మానిస్తున్న అభిమానులు

వి.కోట: ఎంపీపీ, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ యువరాజు తన జన్మదినం పురస్కరించుకుని మంగళవారం అభిమానులు, పార్టీ కార్యకర్తల నడుమ కేక్ కట్ చేసి అన్నదానం చేశారు. ఆయనకు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ, వైస్ ఎంపీపీ తమీమ్, పలువురు పార్టీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మాజీ ఎమ్మెల్యేతోపాటు ఎంపీపీ, తమీమ్‌ను సన్మానించారు.

నోటీస్ బోర్డు

- నేడు మండల సమావేశం

చౌడేపల్లె: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉదయం 10:30 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ లీలామాధవి ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి అన్నిశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.


ఉచిత వైద్య శిబిరానికి స్పందన


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

పలమనేరు: స్థానిక లింగాయత్ వీధిలో సాయిరామ్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో మంగళవారం నిర్వహించిన ఉచిత సంతాన సాఫల్యతా శిబిరానికి మంచి స్పందన లభించింది. బెంగళూరుకు చెందిన గర్భగుడి సంస్థ సౌజన్యంతో ఈ కార్యక్రమాన్ని డాక్టర్లు అపర్ణ, తరంగిణి, యుగంధర్ నిర్వహించారు. శిబిరానికి హాజరైన 70మంది మహిళలకు వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన చికిత్సకు ఎంపిక చేశారు. పిల్లలు లేని దంపతులు ప్రతినెలా ఇక్కడ జరిగే ఉచిత వైద్య శిబిరం సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఈ రోడ్డుకు మోక్షం ఎప్పుడో..?


గుంతలమయమై, దుమ్ముతో కూడిన కాలేజీరోడ్డు


రోడ్డుపై మురుగు నీటి ప్రవాహం

సదుం: మండల కేంద్రంలో ప్రధాన రహదారుల్లో ఒకటైన కాలేజీరోడ్డు గుంతలమయం కావడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ మార్గం నుంచే చెరుకువారిపల్లె, జోగివారిపల్లెకు వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అలాగే జెడ్పీ ఉన్నత పాఠశాల, సామాజిక ఆరోగ్య కేంద్రం, ఎంపీడీఓ, తహసీల్దారు, సీఎల్ఆర్సీ, ఎంఆర్సీ, ప్రభుత్వ జూనియర్ కళాశాల, పశువైద్యశాల, వ్యవసాయ కార్యాలయం, బీసీ, ఎస్సీ హాస్టళ్లు.. ఇలా ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాలన్నా ఈ మార్గంలోనే వెళ్లాలి. అయితే ఎర్రాతివారిపల్లె క్రాస్ వరకు అడుగుకో గుంత ఉండడంతో వాహనాలు వెళ్లే సమయంలో దుమ్ము రేగుతోంది. దీనివల్ల దుకాణదారుల అవస్థలు చెప్పనవసరం లేదు. కాలువలు సైతం సక్రమంగా లేకపోవడంతో మురుగునీరు రోడ్లపైనే ప్రవహిస్తోంది. గత సంక్రాంతికి గుంతలు లేని రోడ్లను నిర్మిస్తామని ప్రభుత్వ మాటలు ప్రగల్భాలుగానే మిగిలాయి. ఇకనైనా రోడ్డును బాగు చేయాలని, కాలువలు నిర్మించాలని కోరుతున్నారు.

గుంతల రోడ్డుతో అవస్థలు

కాలేజీ రోడ్డు గుంతలమయంగా కావడంతో ద్విచక్రవాహనాలలో వెళ్లాలన్నా ఇబ్బందులు తప్పడం లేదు. చాలా రోజులుగా ఇదే పరిస్థితి. ఎందరో ఈ మార్గంలో అధికారులు వెళ్తున్నా పట్టించుకున్న పాపానపోవడం లేదు.

–కిరణ్, సదుం

పూసల రవికి సేవారత్న అవార్డు


సేవారత్న అవార్డును అందుకుంటున్న పూసల రవి

పలమనేరు: పట్టణానికి చెందిన రాష్ట్ర సంచార కులాల సంఘ రాష్ట్ర నాయకులు పూసల రవికి మదర్ థెరిసా సోషల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ నిర్వాహకులు విజయవాడలో మంగళవారం జరిగిన ఓ కార్యక్రమంలో సేవారత్న అవార్డును ప్రదానం చేశారు. బీసీల సమస్యల సాధన కోసం తాను మరింత కృషి చేస్తానని ఆయన తెలిపారు.

త్వరలో స్లో మోటార్‌సైకిల్ రైడింగ్ పోటీలు

చిత్తూరు అర్బన్: త్వరలో స్లో మోటార్‌సైకిల్ రైడింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు ట్రాఫిక్ సీఐ నిత్యాబాబు తెలిపారు. ఈ పోటీలకు 18 ఏళ్లు పూర్తయిన వారు ఇందుకు అర్హులన్నారు. డ్రైవింగ్ లైసెన్స్, బీమా ఉండాలని చెప్పారు. పెండింగ్ చలానా ఉండకూడదన్నారు. పోటీలో గెలుపొందిన వారికి నగదు బహుమతులు ఉంటాయన్నారు. ఈ పోటీ వివరాలను త్వరలో వెల్లడిస్తామని చెప్పారు.

బాల్య వివాహాలను నిరోధిద్దాం


అంగన్‌వాడీ కార్యకర్తలతో మాట్లాడుతున్న సీడీపీఓ

పులిచెర్ల(కల్లూరు): ఎక్కడైనా బాల్య వివాహాలు చేస్తున్న పక్షంలో నిరోధించాలని, అలాగే వీటి వలన కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలని పులిచెర్ల ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ వాణి శ్రీదేవి పిలుపునిచ్చారు. మంగళవారం బాధ్యతల స్వీకరణ అనంతరం తన కార్యాలయంలో మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు సమావేశం నిర్వహించి ఆమె మాట్లాడారు. బాల్యవివాహాల వలన కలిగే అనర్థాల గురించి 11 నుంచి 18 ఏళ్లలోపు బాలికలు, యువతులు, తల్లులకు కిశోరి వికాసం వేసవి శిక్షణ కార్యక్రమాల్లో భాగంగా అవగాహన కల్పించాలన్నారు. వ్యక్తిగత శుభ్రత, మహిళా సాధికారత గురించి వివరించారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఈఓ సిద్ధరామయ్య, సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, రమాదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చౌడేపల్లెలో..


చౌడేపల్లె: చిట్రెడ్డిపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కల్పిస్తున్న మహిళా పోలీస్ ప్రభావతి

చౌడేపల్లె: బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలపై మంగళవారం చిట్రెడ్డిపల్లెలోని అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర బాలికలు, తల్లులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సచివాలయ మహిళా పోలీస్ ప్రభావతి మాట్లాడారు. యుక్తవయస్సు వచ్చే వరకు తల్లిదండ్రులు వివాహాలు చేయరాదన్నారు. చిన్న వయస్సులోనే వివాహాలు చేస్తే శారీరక, మానసిక సమస్యలు తలెత్తుతాయని, అలాగే పుట్టబోయే బిడ్డతోపాటు తల్లికీ ప్రాణాపాయం సంభవించే అవకాశాలు ఎక్కువన్నారు. ఇవి గుర్తెరిగి బాల్య వివాహాలు చేయరాదన్నారు. తల్లిదండ్రులు కూడా తమ కుటుంబ పరిస్థితుల నేపథ్యంలో ఆడబిడ్డలను భారంగా భావించరాదని, పెళ్లీడుకు రాకముందే వివాహాలు చేయరాదని విజ్ఞప్తి చేశారు.

వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రమ్మ

బైరెడ్డిపల్లె: కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా మంగళవారం బైరెడ్డిపల్లె అంగన్‌వాడీ–1 కేంద్రంలో వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రమ్మ మాట్లాడుతూ, పోషకాహార లోపం వలన చాలా మంది రుగ్మతల బారిన పడుతూ ఉంటారని, సరైన పోషకాహారం తీసుకుంటే ఆరోగ్యవంతులుగా ఉంటారన్నారు. బాల్యవివాహాలు చేయరాదని, వీటి వల్ల కలిగే అనర్థాల గురించి తెలియజేశారు. యుక్త వయస్సులో బాలబాలికలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

గాడి తప్పిన రెస్కో

సాక్షాత్తు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలో కుప్పం గ్రామీణ విద్యుత్ సహకార సంస్థ (రెస్కో) విశ్రాంత ఉద్యోగుల పాలనతో ఆపసోపాలు పడుతోంది. ఎండీ ఉద్యోగ విరమణ పొందినా మరో ఆరు నెలలు పొడిగించి ప్రభుత్వం ఆయననే కొనసాగిస్తోంది. నూతన ఎండీ నియామకంపై జాప్యం చేస్తోంది. అలాగే, రిటైర్డ్ అయిన ఏడీ స్థాయి ఉద్యోగి తమకు కూడా విరమణ వయోపరిమితి 62 ఏళ్ల వరకు పొడిగించాలని కోర్టును ఆశ్రయించి, ఉత్తర్వులు తెచ్చుకుని ఆయన కూడా కొనసాగుతున్నారు. ఇలా రెస్కో పాలన వ్యవస్థ రిటైర్డ్ ఉద్యోగులతో సాగుతుండడంతో ఇది ప్రతికూల ప్రభావం చూపుతోందనే విమర్శలొస్తున్నాయి.

- విశ్రాంత ఉద్యోగులతో పాలన అస్తవ్యస్థం
- ఉద్యోగ విరమణ పొందినా ఎండీ కొనసాగింపు
- కోర్టును ఆశ్రయించి రెండేళ్లు పొడిగించుకున్న ఏడీ
- నూతన ఎండీ నియామకంలో జాప్యం ఎందుకో..?
- ప్రభుత్వం ఉదాశీనతే శాపం


రెస్కో కార్యాలయం

కుప్పం: కుప్పం రెస్కో ఎండీ సోమశేఖర్ ఉద్యోగ విరమణ చెందడంతో ఆయన స్థానంలో కొత్తగా ఎవరినీ నియమించలేదు. ప్రస్తుతం ఉన్న ఎండీకే ఆరునెలలు పదవీ కాలం పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంలో ఆయన విధులు నిర్వర్తిస్తున్నారు. ఏపీ ఎస్పీడీసీఎస్ఎల్‌లో సీనియర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న సోమశేఖర్‌ను కుప్పం రెస్కో ఎండీగా గత ఏడాది నియమితులయ్యారు. గత మే 30న ఆయన ఉద్యోగ విరమణ పొందాల్సి ఉంది. అలాగే, కొత్త ఎండీ నియామకం అయ్యేవరకు జాయింట్ కలెక్టర్ పర్సనల్ ఇన్‌చార్జిగా రెస్కో పాలన వ్యవస్థకు పర్యవేక్షించాలి. కానీ సొసైటీ నిబంధనలకు విరుద్ధంగా ప్రస్తుత ప్రభుత్వం రిటైర్డ్ ఉద్యోగినే ఎండీగా కొనసాగిస్తుండటం గమనార్హం! వాస్తవానికి ఏపీ ఎస్పీడీఎస్ఎల్ (ట్రాన్స్‌కో) నుంచి కొత్త ఎండీని నియమించాల్సి ఉంది.

రిటైర్డ్ ఉద్యోగులతో నెలకు రూ.9లక్షల భారం

రెస్కోలో ఏడుగురు రిటైర్డ్ ఉద్యోగులు కొనసాగడం వల్ల రెస్కోలో భారం తప్పడం లేదు. కో–ఆపరేటివ్ సొసైటీకి నిబంధనలకు విరుద్ధంగా నియామకాలు చేశారని సంబంధిత అధికారులు చెబుతున్నారు. రిటైర్డ్ ఉద్యోగులు కొనసాగుతుండటం వల్ల ప్రతి నెలా రెస్కోకు అదనంగా రూ.9 లక్షలు భారం మోస్తోంది. రెస్కోను ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో సంస్థ గాడి తప్పిందనే విమర్శలు వస్తున్నాయి.

రిటైర్డ్ ఉద్యోగులతోనే పాలన

రెస్కో సంస్థలో రిటైర్డ్ అయినా ఉద్యోగులే కీలకమైన పోస్టుల్లో కొనసాగుతూ పాలన వ్యవస్థను నడిపిస్తున్నారు. అలాగే, ఏడీ స్థాయిలో పనిచేస్తున్న మదన్ కుమార్, ముగ్గురు లైన్ ఇన్‌స్పెక్టర్లు, ఇద్దరు లైన్‌మెన్లు రిటైర్డ్ అయ్యారు. ప్రభుత్వం ఉద్యోగుల విరమణ వయోపరిమితి 62 ఏళ్లకు పెంచడంతో వీరందరూ కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆర్డర్ మేరకు వీరంతా యథావిధిగా పనిచేస్తున్నారు. ఉద్యోగ విరమణ అనంతరం రిలీవ్ చేసి ఉంటే వీరికు కొనసాగింపు సాధ్యం కాకపోయేదని, అధికారుల నిర్లక్ష్యమే కారణమని కో–ఆపరేటివ్ సొసైటీ అధికారులు చెబుతున్నారు.

రెస్కో ఏర్పాటు లక్ష్యం ఏమిటంటే..!

మూడు రాష్ట్రాల కూడలి ప్రాంతం మారుమూల గ్రామీణ ప్రాంతంగా ఉన్న కుప్పంలో మెరుగైన విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు 1983లో రెస్కో స్థాపించారు. కుప్పం, గుడుపల్లె, శాంతిపురం, రామకుప్పం, వి.కోట మండలంలో 10 పంచాయతీలను కలుపుతూ దీనిని ఏర్పాటు చేశారు. ఏపీ ఎస్పీడీసీఎల్ అనుబంధంగా రెస్కో కొనసాగుతూ మెరుగైన విద్యుత్‌ను గ్రామీణ ప్రాంతాలకు ఇవ్వాలన్నదే ఏర్పాటు వెనుక ఉన్న ప్రధాన లక్ష్యం. ట్రాన్స్‌కో నుంచి విద్యుత్ కొనుగోలు చేసి సొసైటీ ద్వారా వినియోగదారులకు సరఫరా చేస్తూ వచ్చే ఆదాయంతో రెస్కో కొనసాగుతోంది. అలాగే ఉద్యోగులకు జీతభత్యాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ సామగ్రి కొనుగోలు సంస్థే భరించాల్సి ఉంటోంది. రెగ్యులర్ ఉద్యోగులు 230 మంది ఉన్నారు. వీరికి నెలకు జీతాల రూపేణా రూ.1.40 కోట్లు అవుతోంది. ఇక నెల ఆదాయం రూ.4.50 కోట్లు ఉంటోంది. రెస్కోకు ట్రాన్స్‌కో ద్వారా కావాల్సిన లైసెన్స్ రెన్యూవల్ ఇప్పటివరకు చేసుకోలేదు. ప్రస్తుతం రెస్కో ట్రాన్స్‌కో విద్యుత్ కొనుగోలుకు యూనిట్‌కు రూ.1.90 పైసలు చెల్లించాల్సి ఉండగా, ప్రస్తుతం యూనిట్‌కు రూ.0.40 పైసలు మాత్రమే విద్యుత్‌కు చెల్లిస్తోంది. వినియోగదారుల నుంచి యూనిట్‌కు ట్రాన్స్‌కోతో సమానంగా యూనిట్‌కు రూ.1.30లు వసూలు చేస్తోంది.

నిందితులపై చర్యలు తీసుకోవాలి

డీఎస్పీకి ఫిర్యాదు చేసిన పాత్రికేయులు


పలమనేరు డీఎస్పీ డేరంగుల ప్రభాకర్‌కు ఫిర్యాదు చేస్తున్న పాత్రికేయులు

పలమనేరు: అమరావతి రాజధాని అంశంపై సాక్షి టీవీ డిబేట్‌లో ఓ వ్యక్తి చేసిన కామెంట్‌కు సంబం ధించి రేణిగుంటలోని సాక్షి దినపత్రిక కార్యాలయంపై దాడి చేసిన రౌడీమూకలను వెంటనే అరెస్ట్ చేసి చర్యలు తీసుకోవాలని పలమనేరు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా సభ్యులు మంగళవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో డీఎస్పీ డేరంగుల ప్రభాకర్‌కు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ, రేణిగుంటలోని సాక్షి కార్యాలయానికి ఎలాంటి సంబంధం లేని ఈ వ్యవహారంపై అక్కడ దాడులు చేయడం, రాళ్లు విసరడం, సిబ్బందిని భయభ్రాంతులకు గురిచేయడం తగదన్నారు. దీనికి కారణమైన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఇదే ఘటనకు సంబంధించి నిందితులపై చర్యలు తీసుకోవాలని నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోనూ సాక్షి విలేకరులు ఆయా పోలీసుస్టేషన్లలో ఫిర్యాదులు చేశారు. ఈ కార్యక్రమాల్లో సాక్షి దినపత్రిక నియోజకవర్గ ఇన్‌చార్జి మణితో పాటు, సాక్షి టీవీ రమేష్, మోహన్ మురళి, చంద్రారెడ్డి, వేణు, అశోక్, ఇతర దినపత్రికల విలేకరులు ఆదిశేషయ్య, మునిత్నం, సుబ్బు, దిలీప్‌కుమార్, రంజిత్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.